క్లుప్తంగా

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న జనతా మహిళా సేవా సంఘం ప్రతినిధులు

గోపాలపట్నం: విజయవాడ వరద బాధితులకు సహాయం చేయడానికి జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీకి చెందిన జనతా మహిళా సేవా సంఘం సభ్యులు శనివారం విరాళాలు సేకరించారు. కాలనీలో తిరుగుతూ స్థానిక కుటుంబాల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ఎం. విమల, సంఘ సభ్యులు కేకే లక్ష్మి, కాళ్ల శ్రీదేవి, బి.రమాకుమారి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచులే వినియోగించాలి



గుడ్డ సంచులతో కోరమాండల్ మహిళా ఉద్యోగులు, తదితరులు

మల్కాపురం : ప్లాస్టిక్ బ్యాగుల వాడకం వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతోందని... ప్లాస్టిక్ సంచులు విడనాడి అంతా గుడ్డ సంచులు వినియోగించాలని యాదవ సంఘ నాయకుడు పుర్రె సురేష్ యాదవ్ సూచించారు. కోరమాండల్ మహిళ ఉద్యోగుల ఆధ్వర్యంలో సంస్థ సీఎస్ఆర్ నిధులతో తయారు చేయించిన గుడ్డ సంచులను 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద రైతుబజార్‌కు వచ్చే కొనుగోలుదారులకు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ విభాగ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రద్ధ తీసుకుంటున్నామని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. విమాన్ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శనివారం జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. పనులకు రూ.19.97 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి ప్రసాద్, నరవ పైడిరాజు, వర్క్ఇన్‌స్పెక్టర్ రామ కృష్ణ పాల్గొన్నారు.

23న ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఎట్టకేలకు ఏపీ నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల అధికారిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని నియమించింది. మూడు సంఘాల మధ్య విబేధాలు కారణంగా నాలుగేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో సభ్యుల వినతి మేరకు మూడు గ్రూపులతో శ్రీనివాసరెడ్డి సమావేశాలు నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 8న ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 14న తుది ఓటర్ల జాబితాతో పాటు.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. జిల్లాకు సంబంధించి కో–ఆపరేటివ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ రిజిస్టర్ బి.శ్రీనివాస్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లాలో పోటీ చేసేందుకు సభ్యులు విధిగా ఇప్పటికే ఐదేళ్లు పాటు సభ్యత్వం చెల్లించిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ ఎన్నికలకు సంబంధించి 16న నామినేషన్లు, 17న పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

సెల్లార్లు మాయం..!

- దుకాణాలుగా మార్చేసి వ్యాపారాలు
- పార్కింగ్ సదుపాయం లేక రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు



శ్రీహరిపురం సేవా మార్గంలో సెల్లార్‌ను మూసేసి నిర్మించిన షాపు



శ్రీహరిపురం - జవహర్‌నగర్ రోడ్డుపై నిలిపిన వాహనాలు



శ్రీహరిపురం మూడు రోడ్ల సెంటర్ వద్ద వాణిజ్య కేంద్రంగా మార్చిన సెల్లార్

మల్కాపురం : కొంత మంది స్వార్థం వాహనదారులకు శాపంగా మారుతోంది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాల వద్ద సెల్లార్లను కూడా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఫలితంగా ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డులకు కీలక సెంటర్ శ్రీహరిపురం కూడలి. ఇక్కడకు వస్తే అన్ని వస్తువులు దొరుకుతాయని పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా వస్తుంటారు. ఇదే అదునుగా భావించిన స్థానికులు అద్దెలు, సొంత వ్యాపారాల కోసం షాపులు నిర్మించారు. నిబంధనల ప్రకారం జీ ప్లస్ త్రీ, లేదా జీ ప్లస్ టూ వాణిజ్య భవనాలు నిర్మించే వారు తప్పకుండా సెల్లార్లు ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. కానీ వారు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్మించేశారు. కొన్నిచోట్ల మొదట్లో సెల్లార్లు చూపించి అనుమతులు పొందినప్పటికీ... తర్వాత ఆ సెల్లార్లలోనూ దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఫలితంగా ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలు దారుల వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతోపాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతోంది.

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో...

సెల్లార్లలో వ్యాపారాల నిర్వహణ, పార్కింగ్ సమస్యలపై పలువురు గతంలో జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కొన్నేళ్ల కిందట జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన ఆంజనేయులు శ్రీహరిపురం ప్రాంతంలో పర్యటించి సమస్యను గుర్తించారు. షాపులకు వచ్చే కొనుగోలుదారులకు పార్కింగ్ సదుపాయం కల్పించాల్సిన బాధ్యత భవనాల యజమానులదేనని... అందుకోసం తప్పకుండా సెల్లార్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేకుంటే షాపులకు తాళాలు వేసేస్తామని, సెల్లార్ స్థానంలో ఉన్న దుకాణాలు తొలగిస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో కొందరు సెల్లార్లు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఆంజనేయులు బదిలీపై వెళ్లిపోయిన తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చేసింది. వ్యాపారులంతా తమ సెల్లార్ల స్థానంలో దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఫలితంగా మళ్లీ సమస్య మొదటికొచ్చింది. జవహర్‌నగర్ మార్గంలో పలు వాణిజ్య దుకాణాలు, డిపార్టమెంటల్ స్టోర్స్, ఆస్పత్రులు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉండడంతో పలువురు కొనుగోలుదారులు షాపులకు వచ్చేటప్పుడు రోడ్డుపైనే వాహనాలు పారింగ్ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు



సాయంత్రమైతే జవహర్‌నగర్ మార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. ఇక్కడి దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు మార్గానికి అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. షాపులకు వచ్చే వాహనదారులకు సెల్లార్‌లో పార్కింగ్‌కు సదుపాయం కల్పిస్తే ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టవచ్చు.

– బంక నాగేశ్వరరావు, వాహనదారుడు

అధికారుల చర్యలు శూన్యం



శ్రీహరిపురం సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ కష్టాలే. ఈ మార్గంలో గల వాణిజ్య దుకాణాల వద్దకు వచ్చే వాహనదారులు తమ వాహనాలు రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. ఫలితంగా తప్పుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ప్రయోజనం శూన్యం.

– సమ్మిడి రాజు, వాహనదారుడు

పట్టించుకునేవారేరీ..?



నిరుపయోగంగా మారిన ఫౌంటెయిన్

- కళావిహీనంగా ఎన్ఏడీ ఫ్లై ఓవర్ పార్కు
- ఫౌంటెయిన్ అందాలు కనుమరుగు

విశాఖ విద్య: ఒకప్పుడు పచ్చదనం, పరిశుభ్రమైన వాతావరణంతో పాదచారులను రా రమ్మంటూ పిలిచేలా ఆహ్లాదకరంగా ఉన్న ఎన్ఏడీ ఫ్లై ఓవర్ మధ్యలోని పార్కు నేడు కళావిహీనంగా మారింది. పార్కు నిర్వహణను జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. పచ్చదనంతో సువాసనలు వెదజల్లే మొక్కలు నేలకొరిగి, వాకింగ్ ట్రాక్‌లపై వెళ్లే దారిని కప్పేస్తున్నాయి. మొక్కలకు నీళ్లు పోసేవారు లేక కొన్ని ఎండిపోతున్నాయి.

చూపరులను ఎంతో ఆకర్షించేలా ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్‌ను పూర్తిగా తొలగించారు. దీని చుట్టూ రాళ్లు కుప్పలుగా ఉన్నాయి. మధ్యలో వేసిన నాపరాళ్లు పైకి లేవడంతో గుంతలు పడి నీరు నిలిచిపోయి దోమలకు స్థావరాలుగా మారాయి. ప్రతీ రోజూ ఇక్కడ శుభ్రం చేయకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోతుంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



పార్కులో రాళ్ల కుప్పలు



నాపరాయి తేలి గుంతలు పడిన మార్గం

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద మూడు రోజులుగా ఉంటున్న మతి స్థిమితం లేని యువతిని మమతా చారిటబుల్ ట్రస్ట్ అక్కున చేర్చుకుంది. సింహాచలం రైల్వే స్టేషన్‌లో మతస్థిమితం లేక తిరుగుతున్న యువతిని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మమతా నాయక్, కానిస్టేబుల్ సోనాలి గుర్తించారు. వివరాలు సేకరించేందుకు ప్రయత్నించినా ఆమె మాట్లాడక పోవడంతో మమతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మమతకు సమాచారమందించారు. దీంతో మమత స్టేషన్‌కు వచ్చి ఆమెను ఆదర్శనగర్‌లో మన కుటుంబం అనే హోమ్‌లో ఉంచుతామని తెలిపారు. ఆక్కడ కొద్దిరోజులు ఉంచిన తర్వాత ఆమె కోలుకుని వివరాలు చెప్పగలిగితే వారి కుటుంబ సభ్యుల వద్ద చేర్చుతామన్నారు. ఆమె మానసిక పరిస్థితి కుదుట పడక పోతే మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తామని తెలిపారు.



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద యువతిని అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మమతా నాయక్

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

మల్కాపురం: ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చొనే వ్యక్తి కూడా హెల్మెట్ కలిగి ఉండాలని,లేకపోతే జరిమానాలు తప్పవని మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు అన్నారు. సాధారణ తనఖీల్లో భాగంగా శనివారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద ద్విచక్ర వాహనాల తనిఖీలు చేపట్టారు. శ్రీహరిపురం వద్ద ద్విచక్ర వాహనదారులను నిలిపి వారికి హెల్మెట్ వల్ల ఉపయోగాలను వివరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ సామాజిక బాధ్యత

సింథియా: వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు తెలిపారు. సింథియా సమీపంలో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ షణ్ముఖరావు మాట్లాడుతూ వాహనదారులు మోటారు వాహన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే వారు, వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీహరిపురం ప్రధాన మార్గం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అన్నపూర్ణే.. సదాపూర్ణే

- అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత
- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడోరోజైన శనివారం అమ్మవారు పలుచోట్ల శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పదిరోజుల పాటు మండపాలు, ఆలయాల వద్ద భవానీలకు బిక్ష , భక్తులకు అన్నప్రసాదాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు.



అన్నపూర్ణదేవి అవతారంలో దుర్గమ్మ



అమ్మవారి సన్నిధిలో బద్రీనాథ్, తదితరులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, యాదవ వీధి వద్ద డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భవానీ భక్తులు పీఠం వద్ద సామూహిక కుంకుమార్చన చేశారు. దుర్గాదేవి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. 60వ వార్డు జవహర్‌నగర్ వద్ద షైనింగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు గుడుల సెంటర్ వద్ద నెలకొల్పిన దుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ నాయకుడు కలిదిండి బద్రీనాథ్, బిల్డర్ సంతోష్, అసోసియేషన్ ప్రతినిధులు వై.అశోక్, బుజ్జి, శ్రీను దర్శించుకున్నారు. జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్‌లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. రాజ రాజేశ్వరి కోలాట నృత్య బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

40వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో డీపీ బాయ్స్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షిప్‌యార్డ్‌కాలనీ వాసులందరినీ సింథియా డీపీ బాయ్స్ ఏకతాటిపైకి తీసుకువచ్చి అమ్మవారు ఉత్సవాలు జరిపించి ఐకమత్యానికి నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో డీపీ బాయ్స్ కమిటీ సభ్యులు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: దుర్గా దేవి శరన్నవరాత్రులు సందర్భంగా గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ శనివారం అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం నుంచి అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. కొత్తపాలెం విజయదుర్గా దేవి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులతో పాటు స్థానికులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.



కొత్తపాలెం విజయదుర్గా దేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..



షిప్‌యార్డు కాలనీలో దుర్గాదేవి మండపం వద్ద పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

జీవీఎంసీ స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వద్దు

ఆరిలోవ: జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వహించవద్దని ఇంజినీరింగ్ అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. ముడసర్లోవ వద్ద జీవీఎంసీ వాహన రిపేర్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన పాడైన వాహనాలు, ప్రమాదానికి, మరమ్మతులకు గురైన వాహనాలను పరిశీలించారు. కుప్పలుగా పడి ఉన్న వాటిని చూసిన జీవీఎంసీ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను ఏళ్ల తరబడి ఎందుకు నిల్వ ఉంచాల్సి వచ్చిందని, మరమ్మతులకు గురైన వాటికి రిపేర్లు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన వివరాలతోపాటు ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న వాహనాల వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించిన ఇంధన వినియోగం, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఏన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ ఖర్చును తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్లు సంయుక్తంగా జోనల్ స్థాయిలో ప్రక్షాళన చేస్తూ జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా ప్రణాళికాయుతంగా ఖర్చును నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ముడసర్లోవలో వాహన రిపేర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డిప్లమాతో విస్తృత అవకాశాలు

మురళీనగర్ : డిప్లమాతో అందుబాటులో ఉన్న విస్తృత ఉద్యోగావకాశాలను వినియోగించుకోవాలని మాజీ రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.సుధాకర్ పట్నాయక్ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వార్షికోత్సవం, ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ వ్యక్తి జీవితంలో ఆరోగ్యం, విద్య ప్రధానమైనవన్నారు. కాలేజీలో బాలికలు ఉద్యోగ సాధనలో ముందంజలో ఉండడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బొబ్బిలి శ్రీరామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించినప్పుడే ఉన్నతావకాశాలు పొందగలన్నారు. అనంతరం శ్రీరామమూర్తి మాస్టారును ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ ఘనంగా సత్కరించారు. అనంతరం టి.తులసీరామ్, ఐ.చైతన్యపావని, జి.లిఖితలకు మంహీంద్రా కంపెనీ ఉపకార వేతనాలు అందించారు. సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదరరావు పాల్గొన్నారు.

నీటి నిల్వలే దోమల నిలయాలు

మద్దిలపాలెం: నిల్వ నీరు దోమల ఉత్పత్తికి ఆవాసంగా మారుతుందని, ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ సూచించారు. చైతన్యనగర్, మద్దిలపాలెం, వరాహగిరినగర్‌లో నమోదైన డెంగ్యూ కేసుల గృహాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే–డ్రైడే కార్యక్రమానికి స్థానికులు సహకరించాలని కోరారు. ఇళ్లలో నీటి నిల్వలను గుర్తించే ఈ కార్యక్రమం ఎంతో కీలకమైనదన్నారు. వారం పైబడి నీటి నిల్వలో లార్వా ఉత్పత్తి అయి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆ దోమ కాట వల్లే డెంగ్యూ జ్వరాలు సోకుతున్నాయన్నారు. నీటి నిల్వలు లేకుండా ఇళ్లలోని ఫ్రిడ్జ్‌లు, ఏసీ, ఎయిర్ కూలర్, వాటర్ ప్లాంట్, మనీ ప్లాంట్‌లో క్షుణంగా పరిశీలించి నీటిని తొలగించాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేసిన దోమ తెరలను వాడాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు.



వరాహగిరినగర్‌లో డెంగ్యూ బాధితుడి ఇంటిని పరిశీలిస్తున్న తులసీరాజ్, తదితరులు

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ ఆర్‌సీడీ హాస్పిటల్ ప్రాంగణంలోని బయో డైవర్సిటీ పార్కును శనివారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సందర్శించారు. ఆయనకు పార్కు నిర్వహకుడు ఎం.రామమూర్తి, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పార్కు నిర్వహణ, అక్కడ అందుబాటులో ఉన్న వినూత్న మొక్కలు, ఎడ్యుకేషన్ యాక్టివిటీస్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వైవిధ్యమైన మొక్కలను ఆసక్తిగా తిలకించారు. పార్కులో అన్ని విభాగాలను పరిశీలించి పలు మొక్కల విశిష్టతను తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా అరుదైన జాతికి చెందిన అంజీర్ ఫికస్ కారికా మొక్కను పార్కులో నాటారు. పార్కు అభివృద్ధికి అసవరమైన సహకారం అందిస్తానని నిర్వాహకులకు కమిషనర్ విశ్వనాథన్ మాటిచ్చారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ డీఎస్‌వో శాంతిస్వరూప్, ఎఫ్ఆర్‌వో శ్యామల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, పార్కు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బయో డైవర్సిటీ పార్కు నిర్వహణ కమిటీ సభ్యులతో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్